క్లుప్తంగా

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 1,2,35, 37,39,40 వార్డులలోని సచివాలయాలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజలు తెలియజేసిన ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని సూచించారు. సచివాలయంకు వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆయా వార్డులలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు



కొలకలూరు(తెనాలి): బీజేపీ ఆర్టీ సెల్ జిల్లా కన్వీనర్ కాలిశెట్టి రమేష్‌బాబు సతీమణి నళీమా ఏడో వర్ధంతి సందర్భంగా బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈవోపీఆర్ అండ్ ఆర్డీ వైవీడీ ప్రసాద్ చేతులమీదుగా వస్త్రదానం చేశారు. పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాద్, కాలిశెట్టి హరీష్ నాయుడు, బండి చంద్రమోహన్, యడాలి రాంబాబు, నవనీతం సాయి, ముత్తే వీరరాఘవయ్య, కొచ్చెర్ల శ్రీనివాసరావు, కొలకలూరి దుర్గారావు, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, ఏపూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

శానిటరీ మేస్త్రీకి సన్మానం



తెనాలిఅర్బన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తు గురువారం పదవీ విరమణ చేయనున్న ఏలేష్‌ను అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, సిబ్బంది సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. తెనాలి బుధవారం జరిగిన కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, పలువురు శానిటరీ సెక్రెటరీలు, వర్కర్స్ పాల్గొన్నారు.

దివంగత సంగీత దర్శకుల సంస్మరణ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో సినీ సంగీత దర్శకులు మోహన్‌దాస్, తాతినేని చలపతిరావు, బి.గోపాలం, ఆచార్య శ్రీ, జయదేవ్‌ల సంస్మరణను నిర్వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు దేవరపల్లి నీలాంబరం అధ్యక్షత వహించారు. ప్రముఖ హార్మోనిస్టు తోట కనకయ్య, బెల్లంకొండ వెంకట్, మ్యూజిషియన్ పెద్దిరాజు, నాగప్రసాద్, శ్రీదేవి మాట్లాడారు.

కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి



తెనాలిఅర్బన్: తెనాలి బండ్‌పై ప్రముఖ సినీ హీరో, బుర్రిపాలెం వాసి సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘ నాయకులు తెనాలిలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. కె యశ్వంత్ కుమార్, ఈదర వెంకటపూర్ణ చంద్, షేక్ షబ్బీర్, అఖిల్, సాయి, వెంకటేష్, కుర్రా రాకేష్, షేక్ సుభాని పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కత్తుల పేటలో ఉన్న శ్మశాన వాటికలో కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది బుధవారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. శ్మశాన వాటికలో ఐదు, ఆరు అడుగుల ఎత్తులో చెట్లు పెరిగిపోయాయి. దీనిపై పలువురు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు శానిటేషన్ సిబ్బంది తెలిపారు.

వెలుగుల పండుగకు అంతా సిద్ధం

- తెనాలిలో 50 స్టాళ్లలో బాణాసంచా విక్రయాలు
- వాతావరణంలో మార్పుతో కొనుగోళ్లు అంతంతమాత్రమే అంటున్న వ్యాపారులు
- గతంలో కన్నా పెరిగిన ధరలు



వీఎస్సార్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఓ భాగం

తెనాలిరూరల్: వెలుగుల పండుగ దీపావళికి అంతా సిద్ధమైంది. ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకునేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారు. కులమతాలకతీతంగా జరుపుకునే ఈ పండుగ కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దీపావళి అంటేనే గుర్తొచ్చేది బాణసంచా. ధనికులు, పేదలని తేడా లేకుండా ప్రతి ఇంట్లో దీపాలు పెట్టి టపాకాయలను కాల్చుతారు. వీటి విక్రయాల కోసం పట్టణ వీఎస్సార్ కళాశాలలో అధికారులు స్టాళ్లను ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి బాణాసంచా వ్యాపారులకు తాత్కాలిక లైసెన్సులు ఇచ్చి, డ్రా ద్వారా స్టాళ్లను కేటాయించారు. పట్టణానికి మొత్తం 50 స్టాళ్లను ఏర్పాటు చేయగా, మండలంలోని కొలకలూరులో రెండు. నందివెలుగులో ఒక స్టాలును అధికారులు ఏర్పాటు చేయించారు. ఈ స్టాళ్ల వద్ద ఎటువంటి అగ్నిప్రమాదాలు జరుగకుండా అగ్నిమాపక శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అంతే కాక స్టాళ్ల నిర్వాహకులకు పలు సూచనలు చేసి, నీరు. ఇసుక అందుబాటులో ఉండేలా చూశారు. స్టాళ్లను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు.

పెరిగిన రేట్లు..

గతం కంటే ఈ ఏడాది రేట్లు పెరిగాయని కొనుగోలుదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 30 శాతం ధరలు పెరిగాయంటున్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమవుతున్న వేళ దీపావళి టపాసుల ధరలు మోత పెడుతుండడం మరింత బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



స్టాల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న టపాసులు

బాణసంచా కాల్చేవేళ చేయగూడనివి..

చేతులతో పట్టుకుని టపాకాయలను వెలిగించవద్దని, టపాకాయల వద్ద వంగకూడదని, టపాకాయలపై సీసా, డబ్బా, రేకు వంటివి పెట్టి వెలిగించకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెలగని, పేలని టపాకాయల వద్దకు వెంటనే వెళ్లొద్దంటున్నారు. టపాకాయలను కాల్చే సందర్భంలో నూలు వస్త్రాలనే ధరించాలి. వదులుగా ఉన్న దుస్తులను వేసుకోవద్దని, బిగుతుగా ఉండే దుస్తులనే వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. టపాకాయలు కాల్చే సందర్భంలో గాయం అయితే క్రీం లేదా ఆయింట్‌మెంట్ లేదంటే నూనెను పూయొద్దని వైద్యులు చెబుతున్నారు. నీటితో గాయాన్ని కడిగి వెంటనే వైద్యులను సంప్రదించాలంటున్నారు.

చేయాల్సినవి..

గుర్తింపు, లైసెన్సు కలిగిన దుకాణాలు, తయారీ సంస్థల క్రాకర్స్‌నే కొనాలి. ఒక సమయంలో ఒక వ్యక్తే క్రాకర్స్‌ను వెలిగించాలి. మిగిలిన వారు సురక్షిత దూరంలో ఉండాలి. బహిరంగ ప్రదేశంలోనే టపాకాయలను కాల్చాలి. ఎప్పుడూ పొడవైన కొవ్వొత్తి, కాకరపువ్వొత్తితోనే టపాకాయలను కాల్చాలి. దగ్గరలో రెండు బకెట్ల నీరు సిద్ధంగా ఉంచుకోవాలి. తీవ్రమైన కాలిన గాయాలకు, మంట ఆర్పిన తర్వాత బాధితుడిని శుభ్రమైన దుప్పటిలో చుట్టి వెంటనే వైద్యశాలకు తీసుకెళ్లాలి.

ఇసుక రీచ్‌లు పరిశీలన

తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా



మున్నంగి ఇసుక రీచ్ ను పరిశీలిస్తున్న తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా

కొల్లిపర: నేషనల్ గ్రీన్ ట్రిబునల్ చట్టం లోబడి కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 2024-25లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లను జనరల్ తనిఖీలో భాగంగా తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా, ఆర్‌టీవో, డీపీఓ, ఇరిగేషన్, మైన్స్ వంటి వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలసి బుధవారం మండలంలోని మున్నంగి, పాతబొమ్మువానిపాలెం రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా మాట్లాడుతూ మండలంలో మున్నంగి 13, పాతబొమ్మువానిపాలెంలో 14,15 ఇసుక రీచ్‌లు తవ్వకాలను అనుమతి ఏజెన్సీలకు ఇచ్చినట్లు ప్రస్తుతం నదిలో వరద నీరు ఉండటం వలన ఏజెన్సీలకు ఇసుక తవ్వకాలు ప్రారంభించలేదన్నారు. నదిలో వరద నీరు తగ్గిన వెంటనే ఏజెన్సీలు నదిలో ఎటువంటి మిషన్‌లు పెట్టకుండా కూలీలు ద్వారా ట్రాక్టర్‌లకు లోడింగ్ చేసి బయట ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులకు తరలించి అక్కడి నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి మిషన్ ద్వారా లోడింగ్ చేసి డెలివరీ చేయటం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మైనింగ్ ఆర్ఐ చిమట ఆంజనేయులు, తహసీల్దారు సిద్దార్ధ తదితరలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్, రగ్బీ పోటీలకు తెనాలి విద్యార్థులు



నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తెనాలిఅర్బన్: రాష్టస్థాయి నెట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన నలుగురు, రగ్బీ పోటీలకు ఒకరు ఎంపికైనట్లు తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ తెలిపారు. చిలకలూరిపేటలోని ఎఎంజీ హైస్కూల్‌లో బుధవారం నెట్ బాల్ జట్టు ఎంపిక జరిగినట్లు చెప్పారు. అండర్ 14 విభాగంలో పమిడి గణేష్, బాలికల విభాగంలో పి.సత్యవాణి, అండర్ 17 బాలుర విభాగంలో ఎర్ల తరుణ్, బాలికల విభాగంలో పాలపర్తి లక్ష్మీప్రసన్నలు ఎంపికైనట్లు వివరించారు. నూతక్కి జిల్లా పరిషత్ స్కూల్‌లో జరిగిన రగ్బీ జట్టు ఎంపికలో అండర్ 17 విభాగంలో తమ పాఠశాలకు చెందిన షేక్ బుజ్జి ఎంపికైనట్లు తెలిపారు. వీరిని పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద కుమారి, కోడాలి గోవర్ధన, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌లో రజత పతకం నెగ్గిన అనూరాధరెడ్డి



అభినందిస్తున్న కాలేజీ యాజమాన్యం

తెనాలి: 68వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అంతర జిల్లాల సైక్లింగ్ పోటీల్లో తెనాలికి చెందిన జూనియర్ ఇంటర్ విద్యార్థిని పిట్టు అనూరాధరెడ్డి అండర్-19 విభాగంలో రన్నర్స్‌గా నిలిచింది. అంతర రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. విజయవాడ సమీపంలోని నున్న హైవే దగ్గర్లోని నున్న జిల్లాపరిషత్ హైస్కూలులో ఈనెల 26-28 తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. అనూరాధరెడ్డి స్థానిక బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కాలేజిలో జూనియర్ ఇంటర్ బైపీసీ చదువుతోంది. ఈ సందర్భంగా బుధవారం కాలేజి యాజమాన్యం అనూరాధరెడ్డిని అభినందించింది. కాలేజి కరస్పాండెంట్ మన్నవ మేరీగ్రేస్, ప్రిన్సిపాల్ జంగం సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు చిన్నం పద్మాకర్, చిలుకూరి వెంకట్, కాలేజి అధ్యాపకులు అనూరాధరెడ్డిని అభినందించినవారిలో ఉన్నారు.

పర్యావరణ హిత దీపావళిపై అవగాహన ర్యాలీ



స్కిట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తెనాలి: దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలనే సంకల్పంతో స్థానిక వెస్ట్‌బెర్రీ పాఠశాల విద్యార్థులు బుదవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేశారు. పట్టణ ఆర్టీసీ బస్‌స్టేషను నుంచి చినరావూరు పార్కు వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్న 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, 'పటాసులు వద్దు-పర్యావరణాన్ని కాపాడుదాం' అన్న నినాదాలు చేశారు. పర్యావరణ హితంగా జరుపుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేసే ఫ్లెక్సీతోపాటు ప్లకార్డులను ధరించారు. కూడలి ప్రదేశాల్లో స్కిట్ల రూపంలో పటాసులు కాల్చడం వలన కలిగే ఆరోగ్య సమస్యలు, వాయు కాలుష్యం, ధ్వని కాలుష్యం వంటి ప్రభావాలను వివరించారు. దీపావళిని పర్యావరణానికి హాని కలగకుండా సేంద్రియ దీపాలు, పూలదీపాలు వెలిగిస్తూ, సంప్రదాయపూర్వక పద్ధతుల్లో జరుపుకోవాలనే సూచనలు అందించారు. వెస్ట్‌బెర్రీ పాఠశాల ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, 'మనం పండుగను జరుపుకోవడం ఎంతగానో అవసరం, అయితే పర్యావరణానికి హాని కలిగించకుండా జరుపుకోవడమనే బాధ్యత మనందరిపైన ఉందని ఈ సందర్భంగా చెప్పారు. పర్యావరణ హిత దీపావళికి విశేష ఆదరణను సొంతం చేసుకొని, విద్యార్థులు, ఉపాధ్యాయుల సామూహిక కృషికి ఉదాహరణగా నిలిచిందన్నారు. కో-ఆర్డినేటర్స్ భానుప్రియ, శశికళ, మృత్యుంజయ పర్యవేక్షించారు.

పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని పబ్లిక్ టాయిలెట్స్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్‌లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్స్ నిర్వాహణపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మరోసారి ఫిర్యాదులు వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దు

తెనాలిరూరల్: పట్టణంలో ఇకపై బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకూడదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు పట్టణంలో రాజకీయ పార్టీలు, నాయకులు, వ్యాపార, విద్యా సంస్థలు, వైద్యశాలలు పట్టణంలో ఇకపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వీల్లేదన్నారు. ఎవరైనా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే స్వచ్ఛందంగా మూడు రోజుల్లోగా తొలగించాలని, లేని పక్షంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో తొలగించి, ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పలు విద్యాసంస్థల్లో దీపావళి వేడుకలు



నెహ్రు నికేతన్ స్కూల్‌లో టపాసులు కాల్చుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



అంబియంట్ టెక్నో స్కూల్‌లో జరిగిన వేడుకలలో పాల్గొన్న విద్యార్థులు

తెనాలిఅర్బన్: దీపాళి పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని స్కూల్ ఆవరణలో బుధవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను ముగ్గులతో తీర్చిదిద్ది విద్యార్థులు టపాసులు కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. -చెంచుపేటలోని రత్నశ్రీ పబ్లిక్ స్కూల్ ఆవరణలోని అంబియంట్ టెక్నో స్కూల్‌లో బుధవారం దీపావళి వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్ర ధారణతో పాఠశాలకు వచ్చి ఆవరణను అందంగా అలంకరించారు. టపాసులు కాల్చారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఇర్షాద్ సల్మా, ప్రిన్సిపల్ వై.లక్ష్మీప్రసన్న పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తెనాలి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాజీ చౌక్ నుంచి గంధీచౌక్ వరకు జరిగిన ర్యాలీలో వన్‌టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారిలో అభిమానాన్ని సంపాదించుకున్న అధికారులు, తోటి సిబ్బంది స్ఫూర్తితో విధులు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. త్రీ టౌన్ ఎస్ఐలు నక్కా ప్రకాశరావు, వెంకటేశ్వరరావు, వన్‌టౌన్ ఎస్ఐ సుబ్బయ్య, రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

–తెనాలిరూరల్

ఎన్ఆర్ఐ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



మేడికొండూరు: మండల పరిధిలోని విశదల గ్రామ సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం వల్ల ప్రయోజనాలు వివరించారు. ప్రమాదంలో ఉన్న వ్యక్తికి సరైన సమయంలో రక్తం అందక అనేకమంది ప్రాణాలు పోతున్నాయన్నారు. ఆరోగ్యకరమైన విద్యార్థి రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో 72 యూనిట్ల రక్తాన్ని సేకరించి వెల్ఫేర్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించడం పట్ల కళాశాల సెక్రటరీ రాజేంద్రప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

వక్ఫ్ పరిరక్షణ మహాసభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: ముస్లిం సమాజానికి నష్టం తెచ్చే కొత్త వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని పిలుపునిచ్చారు. బుధవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకున్న 2024 సవరణ బిల్లులో రాజ్యాంగ వ్యతిరేక అంశాలు ఉన్నాయని, ఈ బిల్లు కలెక్టరుకు అథారిటీ ఇవ్వాలనుకోవడం సరికాదని, వక్ఫ్ భూములకు ప్రత్యేకంగా ఉన్న వక్ఫ్ ట్రిబ్యునల్‌ను బలహీన పరిచేలా సవరణ బిల్లు ఉందని, ఈ బిల్లు వస్తే ముస్లిం సమాజం తీవ్రంగా ఇబ్బందులు పడుతుందని అన్నారు. కొత్త వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ విజయవాడ కుమ్మరిపాలెంలో నవంబర్ 3వ తేదీన జమాతే ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరగనున్న వక్ఫ్ పరిరక్షణ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మైనార్టీ నేతలు షేక్ జాని సాహెబ్, షేక్ రషీద్ సాహెబ్ పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికులకు సీఐటీయూ మద్దతు



పోరాటానికి మద్దతు తెలుపుతున్న సీఐటీయూ వై.నేతాజీ, నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర కమిటీ సభ్యుడు వై. నేతాజీ అన్నారు. బుధవారం ఏసీసీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు రావలసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నష్టపరిహారం చెల్లించకుండా కార్మిక నాయకులను అక్రమంగా పదేపదే పోలీసులు అరెస్టులు చేయడం సరికాదని, సుదీర్ఘ కాలం పాటు పోరాడుతున్న ఏసీసీ కార్మికుల పోరాటానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు.

సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులందరు ఐక్యంగా నిలబడి పోరాడాలన్నారు. యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీఫెన్ మరో ఏడుగురిపై అక్రమంగా కేసులు బనాయించడం సరికాదని అన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, నాయకులు కూరపాటి స్టీఫెన్, బి.సూర్యప్రకాష్, ఆశీర్వాదం, సుబ్బారావు, రమాదేవి, బి.అంకయ్య, ఎస్‌కే ఇమాంబీ, నారమ్మ, శివకుమారి, యు.రమణ, కిరణ్, కృష్ణ, సాంబశివరావు, నవనీతం, బి.ప్రభాకర్ పాల్గొన్నారు.

బండారుపల్లిలో పశువైద్య శిబిరం

బండారుపల్లి(తాడికొండ): తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరానికి పశు పోషకుల నుంచి మంచిస్పందన లభించింది. ఈ శిబిరంలో గ్రామంలోని 52 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మినరల్ మిక్చర్, మందులు పంపిణీ చేశారు. అనంతరం 31 దూడలకు నట్టల నివారణా మందు, 15 పశువులకు డీ టిక్కింగ్ చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ డి.బాల శంకరరావు, వైద్యాధికారిణి డాక్టర్ సౌజన్య, డాక్టర్ ఆర్.రవితేజ, పశు వైద్య సహాయకులు ఎ.నవీన్, ధనరాజ్, జి.నవీన్, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గ , సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణకు కృషి

ఫిరంగిపురం: మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్‌బాబు అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఢిల్లీకి చెందిన ఆర్మన్ సంస్థ ఆధ్వర్యంలో సమీకృత అధిక ప్రమాద గర్భధారణ నిర్వహణ నియమాలపై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌బాబు మాట్లాడుతూ గర్భిణుల్లో ప్రమాదాలు ఏ విధంగా గుర్తించాలి? ఏ లక్షణాలు ఉంటే ఎలాంటి పరీక్షలు నిర్వహించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎత్తు, బరువు, రక్తశాతం యూరిన్ ఆల్బమ్, షుగర్ పరీక్షలు చేసి వాటిని సంబంధిత ఎంసీపీ కార్డులో రికార్డు చేయాలన్నారు. అనంతరం ఆర్మాన్ సంస్థకు చెందిన డాక్టర్ చరణ్ శర్వాణి, శివప్రసాద్, ప్రశాంతిలు పలు అంశాలపై ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. మందపాడు, పెదకాకాని, మేడికొండూరు, నుదురుపాడు, ఫిరంగిపురం ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో టపాసులు కాల్చాలి

తాడేపల్లిరూరల్: దీపావళి టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ పండుగను జరుపుకోవాలని ఎంటీఎంసీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ (డ్రైవర్స్ కాలనీ) అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టపాసులు కాల్చే సమయంలో జరిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. దీపావళి టపాసులు కాల్చే సమయంలో చిన్న చిన్న తప్పిదాలు జీవితాన్ని చీకటిగా మార్చే ప్రమాదం ఉందని, టపాసులలో కంటికి హానికరమైన రసాయనాలు ఉంటాయని, కంటిలో కాకర్స్ నలుసులు పడినప్పుడు వంటిని చల్లని నీటితో శుభ్రపరచుకోవాలని సూచించారు. బాణాసంచా కాల్చేటప్పుడు పట్టు, నైలాన్ వస్త్రాలు ధరించకుండా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు.